# ఇంటిదొంగలు

తిరిగేకాలు తిట్టేనోరు ఊరికే ఉండమన్నా ఉండవంట!

తిరిగేకాలు తిరగతావుంటే వచ్చే పీకులాటంతా కాళ్లకే! అదే మాదిర తిట్టేనోరు తిట్తావుంటే ఈ కాలంలో పడేదానికి ఎవుడికి పట్టింది గాచ్చారం?

అయితే ఈ గాచ్చారం వడ్లగింజలో బియ్యపుగింజ మాదిర్తో అందురికీ తెల్సిన సత్తిం.

అయితే తెల్సి తెల్సి తప్పుచేసే వాడే మణిసి!

ఆ మాదిర చేసే తప్పులు రొండో కంటికి తెలవకుండా చేస్తే వాడు మొనగోడు.

ఇది అట్టామాదిరి జల్మం గాదే? మాంసం తింటా వుండామని ఎమికిలు మెడకు యాలాడేసుకోని తిరిగే యవారమే? ఎవురేడబోతే మనకేమని నిమ్మితిగా నీళ్లుతాగి కొంపలో పడి ఉండచ్చుగదా? ఉండలేమే?

ఊరికే ఉంటే ఊరా పేరా?

ఆ నాలుగ్గాళ్లమండపం కాడికి ఉండబట్ట లేకుండా పోవాల. ఆడ నిలబడు కోవాల. ఎవురెవురు ఏమేమి అంటా వుండారో స్రెద్దగా యినాల. దాన్ని యింకొకరి చెవల్లో ఎయ్యాల. ఆ మిందట ఎవుడేమన్నా పడాల!

అప్పిటికీ మా బాశాలి చెవల్లో యిల్లుగట్టుకోని చెప్తానే ఉంటింది.

''మనకూడు మనం కుడస్తా వుండాం. మనగుడ్డ మనం కట్టా వుండాం. మనకొంపలో మనం పడుంటే పోలా. కాదని పొయ్యేదెందుకు? నెత్తిన దుగ్గాణి పెట్తే దమ్మిడీ యిలవ చెయ్యని యదవల దగ్గిర ఒక మాట పడేదెందుకు?'' అని.

ఆడది చెప్పేదేంది? మొగోడు యినేదేంది? అనే అగుటీటం యవారమే. కాలు కట్టి పెట్నా యింట్లో నిలవదే?–

దీన్నే గాచ్చారం అంటారేమో?

గాచ్చారానికి కులమత వెత్తాసాలు ఏమీలేనట్టుగా ఉండాది. అందుకే అన్ని మతాలవాళ్లు దీన్ని నమ్మతారు. సాయిబూలైతే మరీ జాస్తిగా. అందుకేనేమో గాచ్చారం మార్తావుంటే ఖుదా క్యా కర్నా? అంటారు.

ఆ గాచ్చారమే పట్టుకోని దొబ్బతావుంటే ఆ పొద్దు నాలుగ్గాళ్ల మండపం కాడికి పొయ్ నిలబడుకుణ్నా. ఆడ యినబోతే ఎవుడెవుడి మాట వాడోడిదిగా ఉండాది.

''ఒరేవొరే! తిరపతి మున్సిపాల్టీ వాళ్లు పరవాలేదురా. ఒక్కొక్క కవున్సిలర్ చేతికి అచ్చిర్గాలా ఒక లచ్చ రూపాయిలు బిల్ ముక్తాగా యిచ్చేసినారంటా. వాడోడి సత్తా చూపించమన్నారంట.''

''ఆ! ఈ రోజుల్లో ఏముండాదిలేరా? పేరుకే ఒక లచ్చ. అట్టాపొయ్ యిట్టొచ్చే కుందికి ఉరువు లేకుండా పోతింది.''

''నువ్వు చెప్పేది బలే బాగుండాదే? వొంటికి సెగతగలకుండా జల్సా చేసుకుండే దానికా వాళ్లచేతికి లచ్చలిచ్చింది?

''ఇంకెందుకు?''

''వార్డు మింద పన్లు...''

''వాడిపన్లు వొదిలేశా?''

''తేనె తాకిన చేతులు గదా? నాక్కుండా ఎవుడైనా ఎట్టుంటాళ్లే?''

''ఒరే వొరే! పిచ్చోడా. అట్టబొయ్ చూడుపోరా. ఆ రైల్వే కాలనీలో కవున్సలర్. కాలనీలో ఉండేవాళ్లందుర్నీ ఉడ్డ చేర్సినాడంట. ఆ వార్డు మింద జరగాల్సిన పన్లేవో యివరంగా చెప్పినాడంట. తోలీతగా ఏ పనెత్తుకోవాల? మలీతగా ఏ పనెత్తుకోవాల? చెప్పమని వాళ్లనే అడగినాడంట. అంతా వాళ్ల యిష్ట పకారమే జరిపిస్తా ఉండాడంట. కంట్రాక్టు పన్తోగూడా ఆయనకేమీ సంబందమే లేదంట. అదిగూడా వాళ్ల యిష్ట ప్రకారమే ఎవురికి కావాలంటే వాళ్లకే యిచ్చుకోని పని జరిపించుకోవచ్చంట. అప్పుడే పన్లుగూడా మొదులు పెటేసినారంట.!''

''అయితే వాడెవుడో పిచ్చోడుగా ఉండాడు.''

''అది సరే! మా వార్డు కవున్సిలర్ అరీగురీ మనకుండా వుండాడే?''

''మీ వార్డు మింద చెయ్యించాల్సిన పన్లే లేవేమో?''

''సరేలే! ఉండే పన్లన్నీ వొగిటేపారిగా చేసేస్తే యింగొకతూరి ఎలక్సన్లో నిలబడ్తే చెప్పాలగదా? ఏమేమి చెయ్‌పిస్తానని మాట చెప్పాలగదా? అప్పుడేం చెయ్యాల? – ముందు చూపు గదా ముక్యెం!''

''ఒరే మీరు నూరు చెప్పండి. వెయ్యి చెప్పండి. ఈళ్లుండారే? అందురు యింటి దొంగలేరా? అయిన కాడికి మట్టసంగా మడ్సుకుండే యవారం. దేవుడు దిగొస్తే గూడా వాళ్లజోలికి పోలేడు.''

నాలుగ్గాళ్లమండపం కాడ. ఆ పూట ఎవురు కూలికి పిలవబోతారా? అని ఎవురి కండ్లల్లో చూడు ఎదురు చూపులే. చేతిలో బీడిమొక్క. కోటలుదాట్తా మాటలు. ఇంటావుంటే నాకు మాయింటికత గ్యాపకానికొచ్చె!

మా రామన్నకు యిట్టచూస్తే యింట్లో అట్ట చూస్తే బయట శానా మంచి పేరుండేది.

మంచి పేరంటే పాతగుంట సంతలోనో పెనుమూరు పేటలోనో మాయమ్మ ఉప్పు మిరపకాయి కొనుకున్నెట్టు కొనుక్కుండేది కాకపాయ. అయితే మా మారామన్నకు ఎట్టొచ్చిందబ్బా అంత మంచి పేరంటే? – ఏవుండాది? దాని కెన్నో దోవలు!

సమ్మత్సరం సమ్మత్సరం ఆ బారతం మిట్టకాడ తిరేంగడంపిళ్ల పొగులు కత చెప్తాడు. కత చెప్తా చెప్తా ఉంటాడు. ఆ కత మంచి లగువు మింద ఉండేటప్పుడు నిలిపేస్తాడు. కతకంచికి మనం యింటికి అంటాడు. అంత పట్టుమింద ఉణ్ణెకత ఎందుకిట్టయిందని బాదపడ్తాడు. దీనికి ఏందో కారణం ఉండాలంటాడు. ఆకారణానికి దర్మానికి ముడిపెడ్తాడు. కత కొనసాగాలంటే దర్మం వొగిటే దోవ అంటాడు. పొగిడింపులంటాడు. అర్ద రూపాయి దుడ్లు అట్టా యిసిరిపారేస్తే చాలు. ఆ వంశింలో అట్ట రొండు యిట్ట రొండు తరాలు అంతా శిబి సెక్రవర్తి అమ్మా మొగుళ్లేనని అరగెంట సేపు చెప్పిన మాట మల్లా చెప్పకుండా పొగిడేస్తాడు.

అట్టాంటప్పుడు మారామన్న అడగనోడే పాపాత్తుడని అడిగింది అడిగినట్టే ఎత్తెత్తి యిచ్చేస్తా ఉంటే మంచి పేరుకేం కొదవ? పొగిడింపులకేం తక్కువ?

అప్పిటికీ మాయమ్మ 'పొగిడింపుల్తో పొట్టనిండదురా అబ్బోడా!' అని నెత్తిన నోరు పెట్టుకోని మొత్తుకుంటానే ఉండేది. చెవల్లో యేసుకుండే జల్మం గాదే?

మాయమ్మ కత అట్టబెట్టు. మా అయ్యకైతే ముక్కు మిందనే కోపం. అట్టామాదిర కోపం వచ్చినప్పుడు మాయన్నను దగ్గిరికి పిల్సి–

''ఒరే రాముడా! ఆవుమేసేది కసువేరా? అది గొడ్డు. అయినా 'ఊలోళ్లకు ఉచ్చులు పాయ్. పాలోళ్లకు పాలు పాయ్.' అంటా సుదారొస్తే గోవుగూడా చెప్పినట్టు యింటా ఉండాది రా. కడుపుకు కూడుదినే కుండాకోర్ నా కొడకా! ఆ గొడ్డును చూసి అయినా నేర్సుకోరా?'' అంటా మొకాన కారి ఊస్తే గూడా మా రామన్న నోరు తెర్సేవాడు గా

మా రామన్న రచ్చ గెల్సినాడు. ఈ రోజుల్లో రచ్చ గెల్సేదంటే అదేమీ పెద్ద బెమ్మిద్దె కాదు. చేతికొచ్చిన కాడికి ఊలోళ్లకు ఎత్తెత్తి యిచ్చేస్తా ఉంటే వాళ్లకేం? ఉక్కళంగా తినేస్తారు. ఎట్ట పొగడమంటే అట్ట పొగిడేస్తారు.

అదే యింట గెలుపంటే? అమ్మో! అది నాకేగాదు. మీకేగాదు. ఈ లోకంలో ఎవుడికైనా సరే! మాట్లుగాదు. అయితే మా రామన్న యింట్లో గూడా గెల్సినాడు.

''అంత మొనగాడా మీ రామన్న?'' అంటారేమో.

అవును. రామన్న మొనగాళ్లల్లో మొనగాడు.

అదెట్టంటావా?

ఈ సీమలో బతుకులుండాయే? అది మిన్నిరిగి మిందపడ్తా ఉణ్ణా కోడికూత్తో గూడా గోసిపేతలు ఎగచెక్కుకుంటా లెయ్యాల్సిందే. లేచి మోట కట్టాల్సిందే! లేకుండాబోతే నెత్తిన గుడ్డేసుకోని తూరుపుగా పోవాల్సిందే!

మాది గూడా ఎద్దలగొట్టి ముద్దలు తినాల్సిన బతుకేగదా?

కోడిగూసే యాళకాడ మోటకట్టాలంటే మాఅయ్య మాయమ్మ మాయన్న అప్పుడప్పుడు ఎనకతోక మాదిర్తో నేను! ఇంతమంది పాలోమని ఎలబార్తా ఉంటిమా? అదే మా రామన్నకు కురుకురు మీసం వచ్చేపాయానికి యింటి పరిస్తితే మారిపాయ. మొనగోడు ఒకడే! ఒక బుజాన బానామోకు... యింకొక బుజాన బండీ కదురుగోలు... ఒక చేత్తో ఎద్దులు- తిరిగీ మల్లి చూడకుండా పోతాడు. రాళ్లబాయిలో మోటకట్తాడు. రాగాలు తీస్తావుంటే పరవగుట్ట పరవశించి పొయ్యేది. ముగ్గురు చెయ్యాల్సిన పనిని ఒక్కడే తుక్కురేగ చేసుకోని పోతావుంటే యింక యిల్లు పట్టనంత పేరేగదా?

'రామన్న మంచోడు. రామన్న దరమాత్తుడు' అని అందురూ అంటావుంటే నిజింగానే మారామన్న మంచోడై పాయ.

ఇప్పుడు రామన్న పొణుకుండేది దేవుడి అరలోనే!

''యమా! యమా! మా రామన్న దినమ్మూ దేవుడి అర్లోనే పొణుకుంటాడే? ఎందుకమ్మా?'' అని అడిగితే-

''వాణికి బగితి జాస్తి అయిపొయిందిరో!'' అనేది.

ఆ మాట గానా మా అయ్య చెవల్లో పడ్తే-

''వాడొక పిచ్చి నా కొడుకు. నువ్వొక ఎర్రిబాగల్దానివి. గాలికి తిరిగే నా కొడకలకు గదా దేవుళ్లూ దెయ్యాలూ? గుళ్లూ గోపరాలు? రెక్కలించి కష్టపడే వాడికి చెక్కబజినలు ఎందుకే?'' అని యాసణ్ణం పడేవాడు.

ఎవురు ఏమనుకుణ్ణా సరే! అది అర్ధరేత్రిగానీ మా రామన్న పనీపాటా ముగించుకుంటాడు. తానం పానం చేస్తాడు. దేవుడి అర చేర్తాడు. గెడేసుకుంటాడు. ఆ

మిందట దేవుడికి పూజా పునస్కారాలు. ఎట్లా జరిగితిందో ఆ దేవుడికే ఎరిక!

ఒక దినం మిట్ట మద్దేణంకాడ. ఎండ చెండి కొడ్తావుండాది. ఊరికి దచ్చినంగా మంచినీళ్లగుంట. ఆ గుంటనిండికి దామరపూలు. అవ్వి అలలమింద ఆట్లాడే తెల్లకొంగల మాదిర అవుపిస్తా ఉండాయి. ఇసనకఱ్ఱతో యిసిరినట్టుగా చల్లంగా గాలి. ఎవురో దరమాత్తుడు ఆ గుంట కట్టమింద ఎప్పుడో ఎయ్యించిన చలవరాతి బండలు. ఆ బండల మింద పొణుకోని గుంటకల్లా చూస్తా ఉండా. అప్పుడు ఉణ్ణెట్లుండి మాయమ్మ గెట్టిగెట్టిగా అర్సేది చెవల్లోపడె. ఎగిరిపడి లేస్తి. పరుగుల మింద ఊళ్లోకిపోతి. చూద్దును గదా? మాయమ్మ పూనకం వచ్చిన మణిసిమాదిర అరస్తా... అరస్తానే యాడస్తానే మారామన్నను తరిమి తరిమి కొట్టా ఉండాది. కన్నీరు! మా రామన్న దెబ్బలు తింటా పరిగిత్తా ఉండాడేగానీ పల్లెత్తు మాట అన్లేదే? ఒకేళ మా రామన్నే గాన తిరగబడుంటే మాయమ్మ గెతి ఏమయ్యుండాలబ్బా? పుల్సులోకి ఎమికన్నా దొరికుండేదేనా? అని యిప్పుడు అనుకుంటా ఉంటే ఇంటి దొంగల కతంతా యింతేనేమో అని పిస్తా ఉండాది.

మాయమ్మ తిట్టినంత సేపు తిట్టింది. కొట్టినంత సేపు కొట్టింది. ఏడ్సినంత సేపు ఏడ్సింది. ఇంకేం చెయ్యాల్నో తోచకుండా యింట్లో ఒక మూలకుచేరి ముడుక్కుణ్ణింది. పైటకొంగు మూతిమింద ముసుగేసి ఆ తల్లి ముడుక్కోనుంటే నాకు ఏడుపొచ్చినంత పనాయ!

ఇంతకూ ఏం కొంపలు అంటక పొయ్‌నా యబ్బా అంటే?

మా యింట్లో దేవుడర ఉండాదంటి గదా? ఆ అరలోనే ఒక అలమార ఉండేది. ఆ అలమార్లో మా యమ్మ ఒక బుడిగ ఉండీ పెట్టుకుణ్ణింది. ఏది తప్పినా మాయమ్మకు బుదువారం బేస్తారం సంతలకు పొయ్యేపని తప్పదుగదా? అట్లాపొయ్ వచ్చినప్పుడంతా బిళ్లగా ఒక రూపాయి ఆ బుడిగ ఉండీలో యేసిపెట్టేది. అపొద్దు ఎందుకో ఏమో తెల్దు. ఉండీ నిండి పొయ్యుంటింది అనుకుణ్ణిందేమో? పాపం! ఏడుకొండలోడి ఉండీ కుమ్మరించినట్లు కుమ్మరించుకోవాలను కుణ్ణిందేమో? అలమారా తెర్సింది. ఆ ఉండీని చేతికెత్తుకొనింది. అది బొరువుగా ఉండాలగదా? లేసుగా ఉండాది. ఏసి పెట్టిన దుడ్డంతా ఏమయి పొయ్యిందబ్బా? అనుకుంటానే ఆ ఉండీని నేలకేసి కొట్టింది. అది మట్టిదిగదా? వొప్పులొప్పులుగా పగిలింది. మహావుంటే ఒక అయిదారు రూపాయిలుంటా ఏమో? అవ్విగూడా కొట్టే ఎక్కిరిస్తా పరిగిత్తే పిలకాయిల మాదిర మాయమ్మను చూసి పరిగిత్తా మూలకొగిట్టె పాయ. మాయమ్మ కడుపు అగ్గొఱ్ఱంగా రగిలి నట్టుండాది. అప్పుడు మాయమ్మ-

''నా కొడకా! యిదంట్రా యింత కాలంగా నువ్వు చేసిన పూజ!'' అంటా మాయన్న మింద పడింది.

అదే ఆలోచించుకుంటా నిలబడుకోని ఉండా.

నన్ను ఎతుక్కోని వచ్చినట్టు ముత్తారెడ్డన్న ఆడికొచ్చె.

ఆయన్నతో ఊళ్లో కవున్సిలర్ల కతంతా చెప్తి. ఆయన్న గూడా సెద్దగా యినె.

''అన్నా! అన్నా! ఇంటి దొంగను ఈశ్వరుడు గూడా పట్లేడంటారే. ఎందుకన్నా?''

''అది అంతేలేరా!'' అనె ఆయన్న.

''అయితే మాయమ్మకుణ్ణె బయిసి యీళ్లెవురికీ లేదన్నమాట!''

ఆ మాటతో గూడా ఆయన్న పక పక నవ్వతా-

''ఒరే అబ్బోడా! నువ్వొక ఎర్రోడివి. మీయమ్మ ఒక ఎర్రి బాగలర్తి. ఇంకా ఎర్రికాలం మాట్లే మాట్లాడ్తా ఉండారు. మీరేగాదు లేరా. పెద పెద్దోళ్లు! అప్పుడప్పుడు ఆ కోనేటి కట్టకాడ చేర్తా ఉంటారు గదా? ఎట్టుంటారు మణుసులు! గుమ్మడిపొండు మాదిర్తో గుమ్మటంగా ఉంటారు. తెల్లంగా ఉండే పొడుగు పొడుగు చొక్కాయి లేసుకోని నిలబడ్తారు. మాట మాటకు తెల్లోళ్లకతలే ఎత్తుకుంటారు. ఎందుకంటే? ఈ యింటి దొంగల కత మర్సిపోవాలని! పాపం తెల్లోళ్లు? వాళ్లేంది? బయిటోళ్లుగదా? బయపడి పదిరూపాయిలు వాళ్లుతింటే పది రూపాయిలు మనకు తినబెట్రి. మనోళ్లు అట్టాకాదు గదా? ఇంట్లో వాళ్లు. వొళువూ సుళువు బాగా తెల్సుకున్నోళ్లు. వాటంగా బోంచేస్తా ఉండారు. మల్లా సిగ్గూ సెరమూ రొండూ లేకుండా 'వాడింత తింటే నేను తినింది యింతే గదా?' అని నంగి నంగి పలుకులు పలకతారు. తేపితే తెల్సిపోతింది. అందుకే తేపితే తెల్సిపోకుండా సైలెన్సర్లు పెట్టుకుణ్ణారు. వాళ్ల జోలికి పొయ్యే నా కొడుకు ఎవుడుండాడు గానీ నువ్వుపోరా అబ్బారే! కడుపట్నే మండించబాక. బాంబులు పెట్టి కొట్నా చచ్చేది మాత్రం మన బోటోళ్లే!...''

మొకం చిట్లిస్తా కాకరించి తుపుక్కుమని ఊసె. శారదంటే శారదు- ఎంగిలి. మాయమ్మ చేసుకుణ్ణె పుణ్ణెమా? మారామన్న చేసిన దరమ్మో? ఆ ఎంగిలి నా మొకాన పళ్లా! ●